# భోజన ప్రియుడు

బ్రతకడం ఎందుకు? తిండి కోసమా?... కాదు మరెందుకు? భోజనం కోసం! తిండికీ-భోజనానికీ చాలా తేడా ఉంది. ఇది మహాకవి శ్రీనాథుడికి తెల్సు. మళ్లీ మన సోమ్స్‌కే తెలుసు! 'సోమ్స్' అంటే సోమేశ్వర్రావు.

అతని సంగతి బోలెడుంది. అంచేత. దాన్నలా ఉంచండి. అసలు పాకక్రియ అనగా వంట చేయుట అన్నది శాస్త్రమా? కళా? - సైన్సా? ఫైనార్టా? అన్న మీమాంస - జీవితం అంటే 'మిత్తా' అనగా మిథ్యా? లేక 'సత్తా'? అనగా సత్యమా? అన్న మీమాంస - లాంటిదే. కాని, నూటారు సంవత్సరాల క్రితం 1890లో, కంది సుబ్బారావు గారనే నలభీమపాక శాస్త్ర కోవిదుడు - నవకాయ పిండివంటల విద్వాంసుడు - ఓం ప్రథమంగా తెనుగులో వంటల పుస్తకం ఒకటి, మద్రాస్ తిరువళ్లికేణ్ అంటే ట్రిప్లికేన్ నుంచి ప్రకటించాడు. దాని కాయన పాక శాస్త్రమనే పేరు పెట్టాడు.

అంచేత - వంట "శాస్త్ర"మనే అనుకోవాలి. నిజానికది,కంది సుబ్బారావుగారి సొంతం కాదు. నన్నయ్యగారు మహా భారతాన్ని సంస్కృతం నుంచి తెనుగులోకి తెచ్చినట్లు కన్నడంలో నుంచి - మన సుబ్బారావుగారు తెనుగులోకి దీన్ని తీసుకొచ్చారు. కన్నడంలో 1890కి ముందే - మైసూరు గవర్నమెంటు వారే పబ్లిక్ సెక్టారులో సదరు పాకశాస్త్ర గ్రంథాన్ని అచ్చొత్తించారుట? అందులో వంటకి, భోజనానికీ గల అవినాభావ సంబంధం గురించి చెబుతూ కందిసుబ్బారావుజీ, ఇట్లానుడివారు - మనమనసు కుల్లాసమును, శరీరమున కారోగ్యమును, నాలుకకు రుచియునూ, కలిగింపగల పదార్థ ములను విభజించి, వండుటను బోధించునదే పాక శాస్త్రము.

కావున వంట శాస్త్రోక్తముగా చేస్తే, భోజనం షడ్రసోపేతంగా ఉంటుంది! దీన్ని బట్టి ఆధునిక కాలంలో కూడా పాకశాస్త్రాన్ని విరచించిన వాడు మగవాడే అని తేలిపోయింది.

భోజనంలో షడ్రచులూ ఉండాలన్నారు. 'జిందగీ ఖానేకేలియే'', అన్నారు పెద్దలు. అయితే ఆ 'ఆర్రు'చులు ఏవేవి? అనగా 'తీపి' అనగా మధుర : పులుసు అనగా ఆమ్లం: ఉప్పు అనగా లవణ: చేదు అంటే తిక్త: కారమనగా కటు: వగరునావుడు కషాయ: ఇవన్నీసమంగా అవసరమయిన పాళ్లల్లో

ఉండేలా వండి, వడ్డించడం అన్నదే సైన్స్ అండ్ ఆర్ట్! అంతేనా? సోమేశ్వర్రావు మాటల్లో వడ్డన చేయడం కూడా కష్టతరమైన ఒక లలితకళే! దీన్ని కూడా స్టార్‌హోటల్స్‌లో పురుషులే చేస్తారు.

తెలుగువాడి పెరుగు గారెలు అరవ్వాడు కాపీ కొట్టేసి - 'తైర్‌వడై' అన్నాడు. ఇవి సైంటిఫిక్‌గా చేస్తే బెంగాలీ వాడి రసగుల్లాలు నోట్లో వేసుకుంటే కరిగిపోయినట్లు అలాఅలా కరిగిపోయి... ఎందుకులెండి - తెనుగువాడి మినపరొట్టె, దిబ్బరొట్టె. పూరీలీ, కొబ్బరపోళీ, పాలపోళీ, ఫేణీ, పప్పేణీలు, బొబ్బట్లు, గురిగెలు. మరిగంటే మండిగలు. పాకంగారెలు పూర్ణాలూయీ పేర్లే నోరూరిస్తాయి!

వీటి మైనం శ్రీనాథ కవిసార్వభౌముని తరువాత తనకే తెల్సుననుకుంటాడు సోమేశ్వర్రావు! అదంతా వాళ్ల బామ్మాజీ అతగాడికి వెన్నతో పెట్టిన విద్యట! ఈ మాటే అతనొకసారి వాళ్లావిడ నళినీ మనోరంజనితో నోరుజారి అనేశాడు. ఎమ్.బి.ఏ. చదివిన భర్తకు - ఒక కంపెనీలో ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా రాణిస్తున్న సోమ్సుకి - ఎం.ఏ. చేసి ఒక కాలేజీలో లెక్చరర్‌గా పని చేస్తున్న నళిని దీటైన భార్యామణి.

కాకపోతే గరిటె సాములోనే ఆమె బాగా వీకు! దాని క్కారణం ఉంది!

ఆమెకి ఇద్దరు సంతానం. వారిద్దరూ కలిగే దాకా శ్రీవారి పాకశాస్త్ర ప్రావీణ్యం గాని, వంట కళానైపుణ్యంగాని - ఇంత పిసరు తెలీవు! కారణం అప్పటిదాకా వాళ్లు వేరే కాపురం పెట్టకుండా అత్తచాటు కాపురం కొనసాగించారు మరి! అంతే గాని, ఆ దంపతులిద్దరి మధ్య రహస్యాలున్నాయని మనం అనుకోకూడదు. ఈ ఇద్దరికీ రెండు 'మిల్లి గరిటెలు' ఉన్నారని ముందే చెప్పుకున్నాం. అమ్మాయి ఎల్.కె.జీ., అబ్బాయి యు.కె.జీ. ఈ రెండు కే.జీల హ్యాండీకాప్స్ పద్మ రేసు గుర్రాల్లగ - నళినీ సోమ్సులు - హోం స్వీట్ హోం మొదలెట్టారే గాని వంట ఇంట్లోను, డైనింగ్ టేబిల్ దగ్గర - అదేమంత స్వీటుగా ఉండలేకపోయింది.

నళినీ మనోరంజనీకి ఇంగ్లీష్ గ్రామరేగాని వంటింటి వ్యాకరణం అసలు రాదు. ఆమె అట్లపెనం మీద దోసెలు పోస్తే - అవి కాకిరెట్ట ఆకారం లాగ, పాకిస్తాన్‌మ్యాపుల్లాగ వచ్చేవి. దోసెల మీద - చివరి క్షణంలో - వాలిక్కుర్చుకుని - ఉప్పు చిలకరించేది! సాంబార్‌లో మసాలా పొడి, కూరల్లో సాంబారు పొడి వేసేసి - మొగుడికి డైనింగ్ టేబిల్‌మీద డబ్బా పచ్చళ్లు - అంటే క్యాన్డ్ పికిల్స్‌లాంటి అలంకారాలతో డిన్నర్ సెట్ చేసేసి - పిల్లలకి క్యారేజీలు సెట్ చేసి ఇచ్చేసి - తాను హాట్ కేసులో సర్దేసుకుని వెళ్లిపోయేది.

ఈ విధంగా చిన్నప్పట్నించి భోజన ప్రియుడైన సోమేశ్వర్రావుకి నాలిక మీద వెంట్రుకలొచ్చేశాయి తన చిన్నప్పుడు బామ్మ చేసే పప్పు ధప్పళం ముందు గుండయ్యార్ సాంబారే బలాదూర్ అనుకొనే సోమ్సుకి మీల్ ఎన్ మీల్ స్టార్ హోటేల్లో 'థాలీ మీల్స్' అనగా చేత్తో కలుపుకు తినే వీలుగా కంచంలో పెట్టు అన్నం తిని, టిప్పు సుల్తాన్ మామూలుతో సహా ఓ 'వంద' రూపాయలు బేరర్ తెచ్చిన హారతి పళ్లెరంలో పెట్టేసరికి గుబల్లో మంట పుట్టేది.

అట్టి తరి - ఓ ఆదివారంనాడు 'మీల్ ఎన్ మీల్'కి వెళ్దాం అని శ్రీమతి నళిని ప్రపోజల్ పెట్టినప్పుడు - శ్రీ సోమ్స్‌కి - మూడు థాలీ మీల్ స్పెషల్స్‌కి మూడొందలు, మరియు ఆటోకి నలభై రూపాయలు ఇవ్వాలన్న నిజం నిద్దరలో పీడకల్లాగ తట్టింది! వీపున ఎవరో ఛళ్ళున చరిచినట్లయింది!

మరిచిపోయినా అప్పుడప్పుడు మధుర స్మృతుల జల్తరంగిణి లాగ తన మదిలో మెదిలే అలనాటి భోజనానందం తనకు కలగాలి అంటే, తానే చెయ్యి కాల్చుకోక తప్పదు - అనుకున్నాడు - అతని స్వగతంలో చివరి మాట, వైనాట్? అన్న మాట చీదేసిన పోలి పూర్ణం బూరెలాగ బయట పడిపోయింది!

"ఏమిటండీ? సముఖంలో స్వగతాలు?"

క్లాసులోలవ్ లెటర్ రాసుకుంటూ దొరికి పోయిన సీనియర్ ఇంటర్‌మీడియేట్ అమ్మాయి లాగ పట్టుబడి పోయిన భర్తను కిలికించితంగా చూస్తూ అడిగింది ఇంగ్లీష్ మాడమ్!

"ఇట్సాల్‌రైట్! లెటజ్ మేకేమూవ్..." అన్నాడు ఎగ్జిక్యూటివ్‌భర్త 'థాంక్యూడాడీ, థాంక్యూ మమ్మీ' అంటూ కుక్కపిల్లల్లాగ కాళ్లల్లో పడుతున్న వాళ్లకిద్దరుతో వాళ్ళిద్దరూ హోటల్ చేరి, భోజనం ఆర్డర్ చేసేసరికి - రెండేసి గ్లాసుల అయిస్ వాటర్ దాహం వేసేసింది!

×××

నానారకాల పదార్థాలతో సర్వేశ్వరుడు పట్టు కొచ్చిన డిన్నర్ ప్లేట్లు చూసేసరికి సగం ఆకలి చల్లారి పోయింది, శ్రీమాన్‌కి! శ్రీమతి మాత్రం పిల్లలికి అదే పనిగా సూప్ పట్టేస్తోంది. సాంబారు పోసుకుంటూ విసుకున్నాడు శ్రీమాన్. "హలో బేరర్! మీ షెఫ్‌ని ఓ సారి పిలవ్వయ్యా!" అన్నాడు. షెఫ్ అనగా కుక్కేశ్వరుడు రాలేదు గాని స్టూవర్డ్ వచ్చాడు. కాక్రోచ్ గాని రాలేదు కదా? సాంబారులో... అనుకుంటూ... "ఎంసార్! ఎనీ ప్రాబ్లం?" అన్నాడు.

"చూడు! ఈ పులుసులో పప్పు ఉడికిందా? కొంతేమో, మాడు వాసనా, మిగతాది వక్కపొడిలాగ పంటి క్రింద పడుతోంది... ముల్లంగి ముక్క లటయ్యా ఆదివారంనాడు సాంబార్‌లో వేసేది? కాకరకాయలెయ్యలేక పోయారా? పోనీ ఈ ముల్లంగి ముక్కలైనా ఉడకాలా? వద్దా? సెమీబాయిల్డ్ పులుసు ముక్కలు మీ స్పెషలా?" అన్నాడు. "అందుకే మీ షెఫ్‌నిపిలూ! తాజ్ నుంచా? ముంతాజ్ నుంచా? పారిపోయి వచ్చాడు అతగాడు?"

"సారీ సార్! ఫ్రెష్ సాంబారు తెస్తాను" అంటూ మిగతా ఖాతాదారుల కంట పడకుండా, సోమ్స్‌ని మాయం చేస్తేద్దామా? అన్నట్లు అడ్డంగా నిలబడ్డాడు స్టూవర్డ్. అలా నిలబడి, చెవిలో చెప్పాడు "మా కుక్‌కి నిన్న రాత్రి ఫుడ్ పాయిజనింగ్ అయింది సార్! అతను మా ప్రక్క హోటేల్లో భోజనం చేశాడు - వెరైటీ కోసం!... వేరే సమారాధన వంటవాణ్ని ఒకణ్ణి పిలిపించారు మా బాస్! సారీసర్... వెరీ సారీ" - అంటూ ఆ సాంబారు గిన్నెను - ఉగ్గుగిన్నెను తన్నుకు పోయే కాకిలాగ ఎగరేసుకుపోయాడు!

"పద డాళింగ్! ఇంటికి పోయి మనం బ్రహ్మాండమైన మజ్జిగ పులుసు. శనగపప్పు పాతోళీ

చేసుకుందాం," అన్నాడు ఆవేశంగా, సినిమా హీరోలాగ ఊగిపోతూ సోమ్స్.

అలనాడు భీముణ్ని, విరాటుని వంట ఇంటచూసిన సైరంధ్రి ఎలా షాక్ తిందో - అలాగ షాక్ తిన్నది శ్రీమతి నళిని! 'గదను తిప్పే కండలు తిరిగిన ఆ చేత్తో గరిటె తిప్పడమా?' అన్న ద్రౌపది మొహంలా ఉందామె ముఖారవిందం.

"అట్లా స్క్వీజ్ ఇవ్వకు దమయంతీ! కలం సాము చేసే ఈ నా దక్షిణ హస్తం ఇటాలియన్. చైనీస్, మంగోలియన్ లాంటి వంటకాలు కూడా అవలీలగా వండగలదు.. యామనుకున్నావో!" అంటూ నోరు జారాడు భర్త.

xxx

తిరుగు ప్రయాణంలో - తనకు పాకశాస్త్ర పరిజ్ఞానం - పాక కళా ప్రావీణ్యత - కలకత్తాలో ట్రెయినింగ్ అయినప్పుడు ఎట్లా అబ్బినాయో - సత్యనారాయణ వ్రతం కథలాగ, భార్యకి పూసగుచ్చినట్లు చెప్పాడు.

అదే అతను ఆవేశంలో చేసిన తిరుగులేని పొరపాటు. అలా పొరపాటున కాలు కడుక్కోలేని అడుసులో పాదం వేసేశాడు పాపం!

ఆ ఆదివారం రాత్రి సొంత వంటింట్లో మార్నింగ్ డి.డి.షోలో యాండీ లాగ ఫుల్‌డ్రెస్‌లో విజయప్రవేశం చేసిన సోమ్స్ - ది -ఎగ్జిక్యూటివ్‌ని మొదటి రోజే - "యాండీ! మీరెంతో మాంచి కుక్కగారండీ!" అని మెచ్చుకుంది వాళ్లావిడ -

"నేనే వో ఫైవ్‌స్టార్ హోటల్ రన్‌చేస్తే... మిమ్మల్ని చీఫ్ షెఫ్‌గా పెట్టేసుకుంటాను" అన్నది శ్రీమతి. తల్లికి తోడుగా పిల్లలిద్దరూ "డాడీ.. భలే చేశారు కదమ్మా... వెజిటబుల్ కట్‌లెట్టు!-" అంటూ పప్పీలు పెట్టేశారు. పూర్తిగా బోల్తా కొట్టాడు మగవాడు! తానెంతో పొడుగైపోతున్నట్లు పొంగిపోయాడు! సీలింగు తగుల్తుందేమోనన్నట్లు కొంచెం వంగి" మీ మమ్మీ చీఫ్ షెఫ్ అందిరా నన్ను!" అంటూ మురిసిపోయాడు. 'థాంక్యూ" అని ముక్తాయింపు కూడా ఇచ్చాడు.

ఈ దుశ్శాలువా సమ్మానంతో సోమ్స్‌కి ఇక్కట్లు మొదలైనాయి! 'నళినికి కష్టాలు గట్టెక్కాయ్! తప్పేమిటి? ఉమెన్స్ లిబ్‌లో భాగమిది' అనుకున్నాడు. 'నళిని జీతం కూడా తెచ్చి నాకే ఇస్తుంది. నేనామెకి ఇవ్వటంలేదుగా!... సో... నేనామె కోసం వారానికో.. నాల్రోజులు వెరైటీగా వంట చెయ్యలేనా?... గల్ను!... ఇది సమంజసం...' అనుకున్నాడు.

కొన్ని ఇంగ్లీషు పుస్తకాలు కొన్నాడు. చాలా బ్యాకరీలకి, సూపర్ మార్కెట్లకీ తిరిగాడు. టి.వి.లూ, రేడియోలు చూశాడు. కుశాగ్రబుద్ధి గలవాడేమో - ఇంగ్లీషు వంటలెన్నో ఇట్టే నేర్చుకున్నాడు! సిద్ధార్థకాక్, ఆనంద్ కరేన్ లాంటి వాళ్ల వ్యాసాలు పిక్కా పట్టేశాడు. 'ఇటాలియన్, చైనీస్ ఫుడ్స్ కూడా ఇంట్లో' - సొంత కిచెన్‌లో - కుకింగ్ రేంజ్ లేకుండానే చేసేశాడు.

"మీరో జీనియస్ సార్!" అంది చూపుల మెరుపులతో అతగాణ్ని ముంచెత్తుతూ ఆ మగనాలి!

గాని, అంతలోనే భిన్నంగా మొహం నలుపు చేసుకొని - "మగాడి చేత వండించి తింటున్నానని అంతా తిడతారేమోనని భయం వేస్తోందండీ!" అన్నది గాద్గదిక స్వరంతో.

"అహ్హాహ్హా!" అని నవ్వేశాడు భర్త అచ్చం మొగుడిలాగే!...

"హోటల్స్‌లో నువ్వు తింటున్నది మగవాడి వంట కాదూ?... ఫైవ్‌స్టార్స్‌లో కుక్కులేగాని కుక్కమ్మలు ఉండరు! పెళ్లిళ్లలో, సంతర్పణ, సమారాధనల్లో మగవంటే ప్రశస్తంగా చేయిస్తారు తెల్సా?" అని భార్యను ఎంకరేజ్‌చేశాడు. 'మొదటి పాకశాస్త్ర గ్రంథం ఎవడు రాశాడు? మా వాడు - మగవాడు - ' అని కూడా అన్నాడు. 'అడుతు పాడుతు వంట చేస్తూంటే అలు పేమున్నదీ...' అంటూ కూని రాగాలు తీశాడు. 'ఇది హాబీ నా హాబీ' అంటూ ఎగిరేవాడు!

"హిప్ హిప్ హుర్రే" ప్రశంసించేది ఆమె. శ్రీవారికి కలర్ ఫుల్ "ఏప్రాన్" కొని తెచ్చి పెట్టింది. చేతులు బండగా అయిపోతున్నాయని లోషన్‌లు కొనుక్కొచ్చేది. షాపింగ్ పని అంతా - పాపం! తననెత్తిన వేసుకుంది! టోస్టర్ ఈ వారం కొంటే, పై వారం నాన్ స్టిక్ మూకుడు.. మరోసారి మిల్క్ బాయిలర్! ఇట్లా ఎన్నో వంటింటి సుఖాలు కొనితెచ్చి పడేసింది! భర్త అంటే ఆమెకి జున్ను ముక్కంత ఇష్టం!

కాలేజీలో యీవ్నింగ్ ట్యూషన్ క్లాసులొప్పేసుకుంది. 'మీ కోసమే డాళింగ్-' అంది "మనం కుకింగ్‌రేంజ్ కొనుక్కుందాం.. మీ సేల్స్ మేనేజర్ భార్యకేనా ఉంది బడాయి? నాకు లేదా? ఐ విల్ ప్రెజెంటిట్ టు యూ" అని వాగ్దానించింది. రోజంతా ఆఫీసు, వంటిల్లు రెండే గమ్యస్థానాలై పోయాయి పాపం సోమ్సుకి! టెన్నిస్ బంతిని అక్కడ కొడితే ఇక్కడికి - ఇక్కడకొడితే అక్కడికి - అన్నట్లుంది!

xxx

ఆఫీసులో మధ్యాహ్నం సోమ్సు తన హాట్‌కేసు విప్పుకుంటూ ఉంటే - లేడీ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ మందాకిని వచ్చింది. ఆఫర్ చేయకుండానే, ఒక మెంతి వంకాయనిలా ఒయ్యారంగా తన నైల్ పాలిష్ వ్రేళ్ల మధ్యకి అందుకుని - రసగుల్లా ఉండని, నోట్లో వేసుకున్నట్లు అలవోకగా వేసుకుని "వహ్వా.. హ్వా.. టాప్‌జెడ్... స్టఫ్‌డ్ బ్రింజాల్స్... అంటే ఐ లవ్ దేమ్" అంది. "మీ మిసెస్ నలభీమేశ్వరి అనుకుంటాను! హవ్ లక్కీ యూ ఆర్! ... మీ ఇంటికి ఓ డిన్నర్‌కైనా పిల్వరుగా" అంటూ గునుస్తూ వెళ్లిపోయింది -

"ఎందుకయినా మంచిది, ఇటువంటి కర్రీ చేసినపుడు మరో హాట్ కేసు కూడా తెచ్చుకోండి.. నాలాంటి దొంగలుంటారు జాగ్రత్త!" అని సోమ్సుని హెచ్చరించి మరీ వెళ్లిపోయింది -మందాకిని...

ఆ మర్నాడు - అక్కడ నళినీగారి కాలేజీలో - లేడీస్ స్టాఫ్ రూంలో ఇదే టైములో పనస పొట్టు కూర మీద ఘుమఘుమలాడే చర్చ జరిగింది. ఫలితం - శ్రీమతి నళినికి మజ్జిగా అన్నమే మిగిలింది. తాను తెచ్చుకున్నచెట్నీలన్నీ హుష్ కాకీ అయిపోయాయ్. కానీ.. దుఃఖపడలేదు నళిని! బోలెడు గర్వపడిపోయింది! -

'చెప్పుతే యేమవుతుంది? అంతా ఆడమళయాళమేగా!' అనుకుని "ఇది మా హబ్బీ హస్తవాసి!

నా మొహానికి అరటికాయ తొక్కతీసి వేయించడమే రాదు. పనస పొట్టు ఆవకూర కూడానా?'' అని నవ్వేసింది.

అంతే! అక్కడ అకస్మాత్తుగా మెరుపులు, ఉరుములు వచ్చిపడ్డట్లు చూశారంతా - ఇక ప్రశ్నల వర్షం పడిపోయింది ఝుమ్మని ! ...'నీది ఎంతదృష్టం?'' అన్నది - ఉడుకు మోతుగా... ముక్కూ, మూతీ తిప్పి... ముకుందిని!

'ఓస్! కేవలం ఇండియాలో వంటచేసే మగాళ్లనే చూశావ్ నువ్వు! - మా అన్నయ్య లండన్‌లో ఉన్నప్పుడు చూశాట్ట - అక్కడ దొరలు డిష్ వాషింగ్ । అంటే అంట్లు కడుగుట ఎంతో హాయిగా చేస్తారుట.''

''దేనికయినా పెట్టి పుట్టాలి! కంచంలో చెయ్యి కడుక్కొని' కొంగున చెయ్యి తుడుచుకుని వెళ్లి పోయే మొగాళ్ళే ఎక్కువ - మన ఇండియాలో - '' అన్నది లెక్చరర్ సువర్చలా మనోహర్.

మొత్తం మీద, ఇలా, అలా సోమేశ్వర్‌గారి వంట పాపులర్ అయిపోయింది!!

''మీ ఆయన పాకశాసనుడోయ్!'' అనే వాళ్లు కలీగ్స్.

పాకశాసనుడంటే ఇంద్రుడు. దీన్ని బట్టి ఇంద్రుడు కూడా మంచి చెయ్యి తిరిగిన వంట వాడన్నమాట! సర్దాగా అన్వయించారు. అసలు వంట అంతా తాళింపు వేయడంలో ఉంటుందిట. పొత్తు పంచెని... లుంగీ లాగ చుట్టుకుని మడిగా వంటచేసే మా వేలు విడిచిన మేనత్త మొగుడంటూ ఉండేవాడు - 'కొల్లాయుంచితి; కోక సుట్టితి, నని శ్రీనాథుడే అన్నాడు నీకు తెలీదా?' అని 'వంట కూడా ఒక యజ్ఞంలాంటిదే' అనేవాడు మావయ్య.

పాపం! నిజంగా అలానే ఉంది సోమ్సుకి! నళినిని మళ్లీ వంటింట్లోకి లాగడం సాధ్యమా? అని సీరియస్‌గా ఫోన్‌లో నన్నడిగాడు. ఈ కలికాలంలో ఎస్.టి.డి. ఫోన్‌ల వల్ల ఇదో సౌకర్యం. అర్జంటుగా ఇలా సలహాలు అడగొచ్చును.

'అయ్యా! మా ఆవిడ చేసిన పులావు తిన్నాను. కడుపులో మంటగా ఉంది. ఏం మాత్ర వేసుకోమన్నారు?' అని ఫోన్‌లో మనం అడిగితే - టి.విలో తెరమీద - ఫలానా మాత్రలు ఫలానా మెడికల్ షాపులో కొనివేసుకో! నా పేరు చెప్పడం మరిచిపోకు - అంటూ ప్రత్యక్షంగా సలహాలిచ్చే వైద్యశిఖామణులున్న రోజులివి!

వంటలూ మారిపోయాయి. వైద్యాలూ మారిపోయాయి. రోగాలూమారిపోయాయి... ప్చ్...! ప్చ్!! ఫోన్ చేశాడు కదా అని సోమ్సుకి నేను కొన్ని సలహాలిచ్చాను. అన్నింటికన్నా తేలిక - వండిన వంటకి వంక లెట్టడం అనేది మా మామ్మ! అలాగా సలహాలు చెప్పడం కూడా గొప్ప సులువు.

నేనిచ్చిన సలహా ప్రకారం సోమ్సు ఓ రోజు ఫస్టు షో సినిమాకి వెళ్లిపోయాడు. 'ఆఫీసులో బోర్డు మీటింగు ఉంది. రాత్రి పదవుతుంది వచ్చేసరికి! నువ్వే ఏదో తంటాలుపడి వండు! ఫ్రిజ్‌లో ఉన్న స్టఫ్‌తో పిల్లలికింత పెట్టి, నువ్వింత తిను-' అంటూ ఇంటికి ఫోన్ చేసి నళినికి చెప్పేశాడు సోమ్సు.

నళిని అవతల పక్కన వీరుగారిపోడం స్పష్టంగా తెలిపింది. కాని, పెళ్లానికూడా వంట రావాలంటే గుండెరాయి చేసుకోవాలి.కఠినంగా ప్రవర్తించాలి. తప్పదు - అనుకున్నాడు సోమ్స్.

రాత్రిపదిన్నర గంటల వేళ ఇల్లు చేరుకున్నాడు. నళిని - 'వచ్చారా! గీజర్ వేశాను. స్నానం చేసి రాండి,' - అంది. వంటిల్లు, డైనింగ్ హాలు అన్నీ'శలవు' ప్రకటించిన భోజనశాల లాగ - దీనంగా ఉన్నాయి.

"భోజనాలయినాయా? పిల్లలు పేచీలు పెట్టలేదు కదా?" అన్నాడు నీరసంగా, ఆకలిని దాచుకుంటూ.

""మీ కెలాగూ ఆఫీసులో డిన్నరుంటుందిగా అనుకున్నాను! పిల్లలిద్దరికీ మసాలా దోసెలు తెప్పించి పెట్టేశాను. నేను పాలలో అటుకులు వేసుకుని, అరటి పళ్లు నంచుకొని తినేశాను!. అమ్మో! వంట ఇంట్లోకి వెళ్లాలంటేనే నాకు భయం వేసింది.పిల్లలు వెక్కిరిస్తారుకూడా". అని భార్య చెపుతూ ఉంటే - అక్కడే, సోఫాలో కూలబడి పోయాడు సోమ్స్!

కడుపులో ఎలుకలు గోల చేస్తున్నా - తేలు కుట్టిన దొంగలాగ ఊరుకున్నాడు. అసలు సంగతి తెలిస్తే , నళినీ మనోరంజని మనసు బహుమున్నితమైందిగా.

ఆమె హర్ట్ అవుతుంది మరి!

ఇలా ప్రయత్నం వెంబడి ప్రయత్నం ఫెయిల్ అవటంతో - మరో అదిరిపోయే సలహా ఇచ్చాను సోమ్స్‌కి! ఆ సలహా ప్రకారం - ఆదివారం తనే వంట చేసి, తన ఆఫీసులో ఉన్న నలుగురు లేడీ కొలీగ్స్‌నీ భోజనానికి పిలిచాడు.

నళిని ఉడుక్కుంటుదనుకున్నాడు.కాని, డైనింగ్ టేబిల్ సెట్ చేసేసి, ""మా వారికి వంట చెయ్యడం సరదా! ఇదో ఫైనార్ట్ అంటారండీ మా వారు!" అంటూ తానే వడ్డించింది!

బహు దొడ్డ ఇల్లాలు అన్నారు వాళ్ళు. ""మా ఆయనని మీరంతా ఆఫీసులో పాకశాసనుడు అంటారుట కదా!" అని కూడా, నవ్వుతూ అడిగి వాళ్లకి పెంటెడ్ వక్కపొడికూడా అందించింది.

"ఆయన లాగ వండటం ఈ జన్మకి నాకు రాదు ! మరో జన్మంటూ ఉంటే మళ్లీ పుట్టి ఋణం తీర్చుకోవాల్సిందే!" అంటూ నిట్టూర్చింది కూడా.

భోజనాలు చేసి ఆడాళ్లంతా కలిసి పేకాడు కుంటూ ఉంటే, నేనలా వెళ్ళి వస్తానంటూ - ఏడుపు ముఖం దాచుకుందికి. బయట చీకట్లోకి జారుకున్నాడు మనవాడు.. పాపం! మగాడు సోమ్స్.

"శ్రీవారిని చాలా కంట్రోల్‌లో పెట్టారన్న మాట!.. ఇంట్లో ధూమం సేవించరన్న మాట!" అంటూ కిలకిల మంటూ ఆడాళ్ల నవ్వటం అతని చెవుల్లో సీసం కరిగించి పోసినట్లు వినబడ్డది! -

"అకటా! దయలేని వారు మీ ఆడవారూ" అనుకుంటూ వంటింట్లో భీముడు ఆఫీసులో సోముడు అయిన సోమేశ్వర్రావు - ఎస్.టి.డి. కౌంటర్ నుంచి నాకు ఫోన్ చేశాడు!

'అర్ధరాత్రి ఎవరు బాబూ!' అంటూ ఫోన్ అందుకుంది మా ఆవిడ.

"ఓ! సారీ.. మీరా అన్నయ్యగారూ!" అంటూ ఫోను నాకిచ్చింది.

అవతలవాడి మాటలు ఇంకా నా చెవిన పడకుండానే - "ప్రేమ కోసమే వంటింట్లో పడెనే పాపం! శ్రీనాథుడూ." అంటూ కూనిరాగం తీసి మరీ నవ్వేసింది!

అంతా విని, "సోమ్బ్! నువ్వు అధైర్యపడకు.. నేనే నెక్స్ట్ సండే! స్వయంగా వస్తాను! గో అండ్ గెట్ సమ్ స్లీప్! నో ప్రాబ్లెమ్! నేనొస్తానుగా!.. అయితే.. మా సిస్టర్‌కి చెప్పవాకు..." అన్నాను - నిట్టూర్చి పెట్టేశాడు వాడు. సుదీర్ఘమయిన వాడి నిట్టూర్పు - ఇతల నా చెవికి వేడిగా తగిలినట్లని పిలిచింది! "వంట నేర్చిన మగడా! ఆ సంగతి ఇల్లాలికి ఎందుకు చెప్పావయ్యా?"... అంటూ మా ఆవిడతో అన్నాను- "వచ్చే ఆదివారం సెలవు ఇప్పిస్తావుగా..!" అని

"ఆయింట్‌మెంట్, బ్యాండేజీ కూడా సర్ది పెడతాను. మర్చిపోతే జ్ఞాపకం చెయ్యండి" అంటూ కిసుక్కున నవ్వింది మా ఆవిడ -

"అవెందుకూ?"

"మీరు కూడా చెయ్యి కాల్చుకోవాల్సి వస్తుందేమో... మీ సిస్టర్ కోసం! అందుకూ!!" అంటూ లైటార్పేసింది! నా మొహం చూడటానికి జాలిపడింది కాబోలు!...

(1997, ఆంధ్రప్రభ వీక్లీ సంక్రాంతి సంచిక)